

జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా శివజ్యోతి

బెలగాం, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం జిల్లాకేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా వై.శివజ్యోతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని, మెరుగైన వైద్య సేవలు అందిస్తామని ఆమె తెలిపారు. గతంలో ఇక్కడ పని చేసిన అనుభవం తనకుందన్నారు. పదోన్నతిపై పాలకొండ నుంచి ఇక్కడకు వచ్చిన ఆమెను ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఇంతవరకు పనిచేసిన వాగ్దేవి, వైద్య సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



నిషేధమా.. అదెక్కడ?



- జిల్లాకేంద్రంలో జోరుగా పాలిథిన్, ప్లాస్టిక్ వస్తువుల క్రయ విక్రయాలు
- యథేచ్ఛగా వినియోగం
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు
- పర్యావరణానికి ముప్పు అని తెలిసినా పట్టించుకోని వైనం
- నామమాత్రపు చర్యలతోనే సరి..
- అమలు కాని ఉన్నతాధికారుల ఆదేశాలు

పార్వతీపురం టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):

జిల్లాకేంద్రం పార్వతీపురం పురపాలక సంఘంలో పాలిథిన్ నిషేధం అమలు కావడం లేదు. యథేచ్ఛగా పాలిథిన్, ప్లాస్టిక్ వస్తువుల క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా.. నిషేధం కాగితాలకే పరిమితమైంది. 'యథా రాజ.. తథా ప్రజ' అన్న చందంగా మున్సిపాల్టీలో పరిస్థితి మారింది. నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ వస్తువుల వ్యాపారం జిల్లా కేంద్రంలో మూడు పూలు.. ఆరుకాయలు అన్న చందంగా సాగుతోంది. వాటి వల్ల పర్యావరణానికి ప్రమాదం పొంచి ఉందని సామాజిక వేత్తలు, ప్రజా సంఘాల నాయకులు ఎంతగా చెబుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాలు కూడా అమలుకాకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



వరహాల గెడ్డలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ఇదీ పరిస్థితి..

సాలూరు మున్సిపాల్టీతో పాటు పార్వతీపురానికి పక్కనే ఉన్న విజయనగరం జిల్లా బొబ్బిలి పురపాలక సంఘంలో పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్ల నిషేధం పూర్తిస్థాయిలో అమలవుతుంది. కానీ పార్వతీపురం మున్సిపాల్టీలో మాత్రం భిన్న పరిస్థితి నెలకొంది. విద్యావంతులు, మేధావులు ఉన్న అతిపెద్ద పట్టణంలో ప్లాస్టిక్ అమ్మకాలు జరగకుండా చూడాల్సిన ప్రత్యేక నిఘా టీమ్‌లు నిద్రావస్థలో ఉన్నాయి. ఈ విషయంలో పజారోగ్యశాఖాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గత ఐదేళ్లలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి లక్షలాది రూపాయలు విలువ చేసే ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు జిల్లా కేంద్రానికి దిగుమతి అయ్యాయి. అయితే నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు దొరికిన మొదటి సారి రూ. వెయ్యి , రెండో సారి రూ.5వేలు, మూడో సారి భారీ జరిమానాతో పాటు కఠిన చర్యలు చేపడతామని చెబుతున్న సంబంధిత అధికారులు ప్రకటనలకే పరిమితమయ్యారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. పాలిథిన్ వస్తువులను విక్రయించే షాపులపై తూతూ మంత్రంగా దాడులు నిర్వహిస్తున్నారు. సంబంధిత యజమానులతో జరిమానాలు కట్టించి.. నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకుని చేతులు దులుపుకుంటున్నారు. దీంతో జిల్లాకేంద్రంలో వాటి వినియోగం ఏ మాత్రం తగ్గడం లేదు. జోరుగా క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. పట్టణ నడిబొడ్డులో ఉన్న వరహాల గెడ్డ నిషేధిత ప్లాస్టిక్ వస్తువులతో డంపింగ్ యార్డుగా మారడమే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. వాటిని తరలించడం ప్రజారోగ్యశాఖాధికారులకు తలనొప్పిగా మారింది.



ఆటోలో వాటర్ ప్యాకెట్లను తరలిస్తున్న దృశ్యం

ఆదేశాలు అమలయ్యేనా?

జిల్లాకేంద్రంలో పక్కాగా ప్లాస్టిక్ నిషేధం అమలు చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పిలుపునిచ్చారు. ఈ మేరకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా గత నెల మూడో శనివారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. మున్సిపాల్టీలో నిషేధిత ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు, వాటర్ ప్యాకెట్‌ల అమ్మకాలు, కొనుగోలు నిలుపుదల చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రధాన మార్కెట్‌లో గుడ్డ సంచులను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలని సూచించారు. అయితే ఇంతవరకూ బాగానే ఉన్నా.. ప్లాస్టిక్ నిషేధం అమలుపై వారి ఆదేశాలు ఎంతవరకు అమలవుతాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. పాలిథిన్, ప్లాస్టిక్ వస్తువుల వినియోగం.. పర్యావరణానికి ప్రమాదమని ఇప్పటికే ప్రచారం చేస్తున్నప్పటికీ ఫలితం ఉండడం లేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఏ మాత్రం మారడం లేదు.

ఇలా చేస్తేనే..

పాలిథిన్ నిషేధానికి సంబంధించి ప్రజారోగ్యశాఖాధికారులు కఠినంగా వ్యవహరించాల్సి ఉంది. ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువులు విక్రయిస్తున్న వ్యాపారులపై భారీ జరిమానాల తో పాటు పర్యావరణ రక్షణ చట్ట ప్రకారం చర్యలు తీసు కోవాలి. లేకుంటే భవిష్యత్ తరాల వారికి ఇబ్బందులు తప్పవు. 'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత' అనే నినాదంతో ప్రజలను (మిగతా 8వ పేజీలో..)

సాలూరు కమిషనర్ బాధ్యతల స్వీకరణ



మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణారావు

సాలూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా డీటీవీ కృష్ణారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాల్టీని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో పరిపాలనా అధికారిగా విధులు నిర్వహించే ఆయన డిప్యుటేషన్‌పై సీఎం కార్యాలయంలోని గ్రీవెన్స్ విభాగంలో పని చేసేవారు. బదిలీపై సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు. కాగా ఇప్పటివరకు సాలూరు ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేసిన సీహెచ్ సత్యనారాయణ విధుల్లో నిర్లక్ష్యం కారణంగా సీడీఎంఏకు సరెండర్ చేసిన విషయం తెలిసిందే.

టాస్ వేసి.. బ్యాట్ పట్టి..

- క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి
- క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని సూచన

సాలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): యువత ఆటల ద్వారా క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు. శ్యామలాంబ అమ్మవారి పండగను పురస్కరించుకుని శుక్రవారం సీనియర్ క్రికెటర్లు నిర్వహించిన టోర్నమెంట్‌ను ఆమె టాస్ వేసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం బ్యాట్ పట్టుకుని తొలి బంతిని కొట్టారు. దీంతో ఆ ప్రాంగణం చప్పట్లతో మార్మోగింది. రానున్న శ్యామలంబ అమ్మవారి పండగకు యువత వలంటీర్లుగా సహాయం చేయాలని కోరారు.

ప్రతిభ ఆధారంగానే నియామకాలు

ప్రతిభ ఆధారంగానే ఉద్యోగ నియామకాలు చేపడుతున్నామని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. సాలూరులోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఇటీవల అంగన్‌వాడీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. గత ప్రభుత్వంలో దళారుల సంఖ్య చాలా ఎక్కువగా ఉండేదని, వారు నిరుద్యోగుల నుంచి డబ్బులు తీసుకుని.. ఉద్యోగాలు ఇచ్చేవారు కాదని ఆరోపించారు. గతంలో ఇలా మోసపోయిన బాధితులు ఎంతోమంది ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో పైసా ఖర్చు లేకుండా కేవలం అర్హతను బట్టి ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మక్కువ మండల అధ్యక్షుడు వేణుగోపాలనాయుడు, ఏఎంసీ ఛైర్మన్ ముఖీ సూర్యనారాయణ, నాయ కులు యుగంధర్ , కార్యకర్తలు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.



బ్యాట్ పట్టి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి



పార్వతీపురంలో శిలువ యాత్ర ప్రదర్శన

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

- జిల్లావ్యాప్తంగా ఏసు శిలువ యాత్ర ప్రదర్శన
- అధిక సంఖ్యలో పాల్గొన్న క్రైస్తవులు

8లో

డ్రైడేను తప్పనిసరిగా పాటించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

8లో

కింగ్ కోబ్రాల సయ్యాట

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశాలకు వేళాయే..

- 21 నుంచి 30వ తేదీలోపు చేరేందుకు అవకాశం

8లో

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రను విజయవంతం చేయాలి: కలెక్టర్

పార్వతీపురం,ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. శుక్ర వారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి గ్రామంలో "ఇ వేస్ట్ మేనేజ్మెంట్" పేరిట ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. కార్యాలయాల్లో పరిశుభ్ర వాతావరణ నెలకొనే విధంగా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదివేల మంది జనాభాకు మించి ఉండే గ్రామాల్లో విధిగా ఈ కార్యక్రమం చేపట్టాలని, స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో ఇ-వేస్ట్ సేకరణ, నిల్వ చేసేందుకు అవసరమైన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి దూరంగా ఉండాలని, దీనిపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని వెల్లడించారు. జిల్లాలో చెత్త సంపద తయారీ కేంద్రాలన్నీ పనిచేయాలని డీపీవోను ఆదేశించారు. 212 కేంద్రాల నుంచి వర్మీ కంపోస్టు ఉత్పాదకత జరగాలని స్పష్టం చేశారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గాలీవాన బీభత్సం

- సాలూరు ఏజెన్సీలో నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- పిడుగుపాటుకు ఆవు మృతి

సాలూరు రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సాలూరు, పాచిపెంట మండలాల్లో శుక్రవారం గాలివాన బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎండ వేడిమి అధికంగా ఉండగా.. ఆ తర్వాత వాతావరణం మారింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఆ తర్వాత ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. సాలూరు మండలం మామిడిపల్లిలో దండిగాం వైపు వెళ్లే మార్గంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల సమీపంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దండిగాం,శంబర మార్గాల వైపు వాహన రాకపోకలు స్తంభించాయి. ఇందులో తోణాం వచ్చే 108 వాహనం సైతం చిక్కుకోవడంతో గర్భిణీ తిప్పలు పడింది. అంటివలస జంక్షన్, గంగన్నదొరవలస వద్ద చెట్లు నేలకూలాయి. పలు చోట్ల అరటి చెట్లు సైతం నేలవాలాయి. స్థానికులు సహాయక కార్యక్రమాలు చేపట్టి రాకపోకలకు వీలు కల్పించారు. పాచిపెంట మండలం కూనంబందవలస, గడివలస మార్గంలోనూ చెట్లు పడ్డాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. గడివలసలో పెళ్లి ఊరేగింపు వారు ఇబ్బందులు పడ్డారు. సకాలంలో స్థానికులు స్పందించి చెట్లు తొలగించారు. ఇదిలా ఉండగా మామిడిపల్లి గ్రామ శివారులో ఉన్న పొలంలో పిడుగు పడడంతో అక్కడే ఉన్న ఆవు మృతి చెందింది. గాలీవాన వల్ల జరిగిన నష్ట వివరాలను సాలూరు తహసీల్దార్ ఎన్వీ రమణ ఆరా తీశారు. • సాలూరు: సాలూరు పట్టణంలోనూ తేలిక పాటి వర్షం కురిసింది. అయితే వాతావరణం చల్లబడడంతో మధ్యాహ్నం వరకు ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలు కాస్త ఉపశమనం చెందారు.



మామిడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల సమీపంలో కూలిన చెట్టు





నేలకొరిగిన విద్యుత్ స్తంభం, సాలూరు-మామిడిపల్లి మార్గంలో నిలిచిన వాహనాలు

సకాలంలో స్పందించి.. ప్రసవ వేదన తప్పించి..

- నెలలు నిండకుండానే కొఠియా గ్రూప్ గిరిజన గర్భిణికి నొప్పులు
- సత్వర కాన్పునకు చర్యలు
- వ్యూహాత్మకంగా ఆలోచించిన తోణాం వైద్యుడు



గర్భిణి పారమ్మను 108 వాహనం వద్దకు తీసుకెళ్తున్న వైద్య సిబ్బంది

సాలూరు రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వివాదాస్పద కొఠియా గ్రూప్‌కు చెందిన ఓ గిరిజన గర్భిణికి సకాలంలో వైద్య సేవలందేలా చేశారు తోణాం పీహెచ్‌సీ వైద్యాధికారి. నెలలు నిండకుండానే ప్రసవ వేదనతో అల్లాడుతున్న ఆమె పరిస్థితిని ఏఎన్‌ఎం ద్వారా తెలుసుకున్నారు. వ్యూహాత్మకంగా ఆలోచించి.. ఆ గ్రామం నుంచి పట్టణానికి రప్పించారు. సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె సుఖ ప్రసవమైంది. ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళ్తే..

సాలూరు మండలం కొఠియా గ్రూప్ గ్రామం సిమ్మగెడ్డకు చెందిన బుడియా పారమ్మకు కొన్నేళ్ల కిందట సలపరబందకు చెందిన కాంబుతో వివాహమైంది. ఎనిమిది నెలల కిందట పారమ్మ గర్భం దాల్చింది. అయితే ఆ ఆనందం ఎంతో కాలం నిలవలేదు. ఉపాధి పని కోసం వలస వెళ్లిన భర్త కాంబు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కూలి పనుల కోసం ఆమె బొబ్బిలి మండలం గోపాలరాయుడుపేట సమీపంలో ఉన్న అక్యాన వలసకు వలస వెళ్లింది. కాన్పు తేదీ దగ్గర పడుతుండడంతో ఇటీవల సలపరబందకు వచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం నొప్పులు రావడంతో గంజాయిభద్ర ఏఎన్‌ఎం కవిత తోణాం పీహెచ్‌సీ వైద్యుడు అక్యాన అజయ్‌కు సమాచారమిచ్చారు. ఆ గ్రామం కొఠియా గ్రూపులో ఉండడంతో ఏపీ 108 వాహనం పంపితే ఒడిశా పోలీసులు అడ్డుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వ్యూహాత్మకంగా ఆలోచించిన వైద్యుడు అజయ్ అక్కడే ఆటోను ఏర్పాటు చేశారు. పారమ్మ ఆటోలో సజావుగా నేరెళ్లవలస సంతకు చేరుకునేలా చేశారు. అక్కడ నుంచి ఫీడర్ అంబులెన్స్ ద్వారా తోణాం పీహెచ్‌సీకి తరలించారు. ఆమెకు తొలి కాన్పు కావడం, పురిటి నొప్పులు తీవ్రంగా ఉండడంతో 108 వాహనంలో సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించే ఏర్పాటు చేశారు. అయితే ఆ వాహనం మామిడిపల్లికి వచ్చేసరికి గాలివాన కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు రోడ్డుపై పడిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. అప్రమత్తమైన సిబ్బంది ఈ విషయాన్ని సాలూరుకు ఆసుపత్రికి తెలియజేశారు. దీంతో అధికారులు పట్టణం నుంచి మామిడిపల్లి పీహెచ్‌సీకి 108 వాహనం పంపారు. అక్కడ ట్రాఫిక్‌లో నిలిచిన వాహనంలో ఉన్న గర్భిణి పారమ్మ దించి నడిపించు కుంటూ వెళ్లి సాలూరు నుంచి వచ్చిన వాహనంలో ఎక్కించారు. సాలూరు ఏరియా ఆసుపత్రి వైద్యులు ఆమెకు ప్రసవం చేశారు. పారమ్మ ఆడ బిడ్డకు జన్మించింది. 'వచ్చే నెల 25 వరకు పారమ్మ డెలి వరీకి సమయం ఉంది. ఈ లోగా నొప్పులు రావడంతో ఒడిశా పోలీసులు ఇబ్బందులు రాకుండా సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించాం.' అని తోణాం పీహెచ్‌సీ వైద్యుడు అజయ్ తెలిపారు.



సాలూరు వైపు ఉన్న వాహనం ఎక్కిస్తున్న దృశ్యం





మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు

ఏదీ స్వర్ణాంధ్ర.. ఎక్కడ స్వచ్ఛాంధ్ర

● మున్సిపల్ కార్యాలయంలో ఎక్కడికక్కడే వ్యర్థాలు

రాజాం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో చెత్త పేరుకుపోతోంది. ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల పేరిట అధికారులు చేపడుతున్న చర్యలు కేవలం ఫొటోలకే పరిమితం అవుతున్నాయి. గతనెల మూడో శనివారం బస్టాండ్ ఆవరణలో ఎమ్మెల్యేతో పాటు అధికారులు చీపుళ్లతో చెత్తాచెదారాలు ఊడ్చారు. ఆ తర్వాత బస్టాండ్ వైపు కన్నెత్తి చూడటంలేదు. ఈనెల 19న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పేరుతో రాజాంలో ర్యాలీ నిర్వహించేందుకు మున్సిపల్ యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. కార్యాలయంలో పేరుకుపోతున్న చెత్తను పరిశుభ్రం చేయించలేని అధికారులు ర్యాలీలు చేపట్టడంతో ప్రయోజనం లేదనేది పలువురి మాట.

న్యాయ సేవాధికారి సంస్థ జిల్లా కార్యదర్శిగా కృష్ణప్రసాద్



బాధ్యతలు స్వీకరించిన కృష్ణప్రసాద్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శిగా ఎ.కృష్ణప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం జిల్లా గాజువాక అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారిగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

నేడు గ్రామాల్లో మంత్రి కొండపల్లి పర్యటన

గంట్యాడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వసాది, బురదపాడు, రేగుబిల్లి, కొర్లాం గ్రామాల్లో శనివారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పర్యటించనున్నారని ఎంపీడీవో రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొంటారని ఎంపీడీవో పేర్కొన్నారు.

నేడు రేగిడి మండల సమావేశం

రేగిడి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మ ధ్యాహ్నం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శ్యామలకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు.

చెరువు పనుల పరిశీలన

రాజాం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచరాంలో జరుగుతున్న పైలవాని చెరువు పనులను శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు ప్రతీ రోజు ఉదయం సమయానికి పనులకు హాజరు కావాలన్నారు. ప్రణాళికబద్ధంగా పనులు చేసి గిట్టుబాటు వేతనం పొందాలన్నారు. ఈ సందర్భంగా మస్తర్లను ఆయన తనిఖీ చేశారు.



మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో

జిల్లావ్యాప్తంగా వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో 61 ప్రాంతాల్లో ఆకస్మికంగా పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. వాహన తనిఖీల్లో ఎస్పీ వకుల్ జిందాల్‌తో పాటు ముగ్గురు డీఎస్పీలు, 14 మంది సీఐలు, 44 మంది ఎస్ఐలు, 276 మంది పోలీసులు పాల్గొన్నారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలు సీజ్ చేశామన్నారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో అనుమతి పత్రాలు లేని 20 కిలోల వెండి వస్తువులను గుర్తించామన్నారు. వంద మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఎస్పీ వెంట ఎస్‌బీ ఎస్ఐలు లీలారావు, ఆర్వీఆర్‌కే చౌదరి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం



కమిషనర్‌ను సత్కరిస్తున్న వైస్ చైర్మన్ రామారావు

నెల్లిమర్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎ.తారక్‌నాథ్ శుక్రవారం చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణలను మర్యాదపూర్వకంగా కలిశారు. నగర పంచాయతీ భౌగోళిక, ఆర్థిక పరిస్థితుల కోసం చర్చించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు నల్లి శ్రీను, తుమ్మ నారాయణమూర్తి ఉన్నారు.

సొంతిళ్లు లేనివారు సద్వినియోగం చేసుకోండి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌వర్మ



మాట్లాడుతున్న రాజేశ్‌వర్మ

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0ను సొంతిళ్లు లేనివారు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌వర్మ కోరారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పథకాన్ని అమలు చేస్తున్నాయన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు సుధీర్, బోడసింగి నారాయణరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ప్రశాంతతపై భూమన కుట్ర



ఎమ్మెల్యే మురళీమోహన్

రాజాం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) తిరుమల ప్రశాంతతకు భంగం కలిగించేందుకు వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డి కుట్రకు తెరలేపారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఒక ప్రకటనలో ఆరోపించారు. వైసీపీ హయాంలో గోవులకు నాసిరకం దాణా, కాలం చెల్లిన మందులు ఇచ్చి నోరులేని మూగజీవాలను బలి తీసుకున్నారన్నారు. గోవులు మరణించినా ఆ లెక్కలు బయటకు రాకుండా చేశారన్నారు. ఆ అరాచకాలకు అప్పటి గోశాల డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి బాధ్యుడన్నారు. తాజాగా గోవుల మృతిపై గోశాలకు వచ్చి పరిస్థితులను పరిశీలించుకోవచ్చనే ప్రభుత్వ సవాల్‌ను వైసీపీ నేతలు ఎందుకు స్వీకరించలేకపోతున్నారని ప్రశ్నించారు. ధర్మబద్ధంగా నడుస్తున్న ప్రభుత్వంపై నిందలు మోపడం సరికాదన్నారు. టీటీడీలో గోవుల మరణాలపై తప్పుడు వార్తలను ప్రచారం చేయడాన్ని ఖండించారు. ప్రజల మనోభావాలను కించపరిచే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు. కొన్ని గోవులు అనారోగ్యంతో సహజంగా మృతి చెందితే దాన్ని రాజకీయం చేయడం సరికాదని కోండ్రు అన్నారు.

భూములకు నష్టపరిహారం ఇవ్వండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

లక్కవరపుకోట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పెందుర్తి-బొడ్డవర వరకు నాలుగు లైన్ల బైపాస్ రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం భూపోరాట సమితి ప్రతినిధులు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే లలితకుమారిని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కొత్తవలస, ఎస్.కోట మండలాల మధ్య భూములు చాలా విలువైనవని తెలిపారు. గజాల్లో పరిహారం అందజేయాలన్నారు. మార్కెట్ రేటుకు పది రెట్లు విలువైన భూములని గుర్తుచేశారు. కార్యక్రమంలో రాంబాబు, రమణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న నాగార్జున

గరివిడి/చీపురుపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. శనివారం చీపురుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాం ధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో వచ్చిన ఎన్నో పరిశ్రమలు వైసీపీ ప్రభుత్వ వైఖరితో వెనక్కి మళ్లాయన్నారు. టీడీపీ కృషి ఫలితంగా తిరిగి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు వస్తున్నారన్నారు. 9 నెలల్లో రూ.7 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని వివరించారు. టీసీఎస్‌కు అతి తక్కువ ధరకే భూములు కేటాయించడం పై వైసీపీ నాయకులు గగ్గోలు పెట్టడం ఆశ్చర్యంగా ఉందన్నారు. టీసీఎస్ ఏర్పాటుతో 12 వేల మందికి ఉపాధి కలుగుతుందన్నారు. వైసీపీ పాలనలో విధ్వంసాలు తప్ప చెప్పుకోవడానికి ఏమీలేవని నాగార్జున అన్నారు.

మూడు ఉద్యోగాలకు ఎంపిక

● సత్తాచాటిన తాలాడ గోపాలకృష్ణ



గోపాలకృష్ణ

నెల్లిమర్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీలోని జరజాపుపేటకు చెందిన తాలాడ గోపాలకృష్ణ ఒకేసారి మూడు బ్యాంకు ఉద్యోగాలు సాధించి సత్తా చాటాడు. యూనియన్ బ్యాంకులో లోకల్ బ్యాంకు ఆఫీసర్ ఉద్యోగం సాధించడంతో పాటు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో క్లర్క్, కర్ణాటకలో కెనరా బ్యాంకు క్లర్క్‌గా ఎంపికయ్యాడు. మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసిన గోపాలకృష్ణ కొన్నాళ్లుగా బ్యాంకు పరీక్షలకు శిక్షణ పొందుతున్నాడు. మూడు బ్యాంకు ఉద్యోగాలు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలిచిన గోపాలకృష్ణను నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావుతో పాటు పలువుర కౌన్సిలర్లు, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా కౌముది పరిషత్ వార్షికోత్సవం



చంద్రశేఖర్‌ని సన్మానిస్తున్న కౌముది పరిషత్ సభ్యులు

విజయనగరం బాబామెట్ట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక రింగురోడ్డులోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కౌముది పరిషత్ సాహిత్య సాంస్కృతిక సమాఖ్య వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ అవధాని డాక్టరు కట్టమూరి చంద్రశేఖర్ కు సన్మానం చేశారు.అనంతరం పలువురు కళాకారులు, కళాభిమానులను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దవళ సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

21న ఆరో తరగతి ప్రవేశపరీక్ష

నెల్లిమర్ల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లలో ఆరో తరగతి ప్రవేశపరీక్ష 21న నిర్వహించనున్నట్టు సతివాడ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న పరీక్ష నిర్వహించనున్నట్టు ముందుగా ప్రకటించినప్పటికీ ఆ రోజు ఈస్టర్ పర్వదినం సందర్భంగా పరీక్ష వాయిదా పడిందన్నారు. 21న నిర్వహించనున్న సరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతుందన్నారు.

ఎల్‌పీసీలు ఇవ్వక.. ఇళ్ల నిర్మాణాలు సాగక

● కొండమల్లిపూడి గిరిజనుల ఆవేదన

శృంగవరపుకోట రూరల్ ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరమణపేట పంచాయతీ కొండమల్లిపూడిలో ఇళ్ల నిర్మాణాలకు రెవెన్యూ అధికారులు ఎల్‌పీసీ (ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్) ఇవ్వడంలేదు. దాంతో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. ఎల్‌పీసీ ఉంటే ప్రభుత్వం ఇళ్లకు రుణాలు మంజూరు చేస్తుంది. దాంతో వారు వీఆర్వో చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. శుక్రవారం బాధితులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. తాతలతండ్రుల నుంచి సర్వే నెంబర్ 3లో నివాసం ఉంటున్నామన్నారు. గతంలో టీడీపీ హయాంలో అక్కడే ఇంటి స్థలాలిస్తే ముగ్గురు ఇళ్లు నిర్మించారన్నారు. వారికి ప్రభుత్వం సాయం కూడా చేసిందన్నారు. ఆ సమీపంలో 14 ఇళ్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయన్నారు. దాంతో మూడునెలల కిందట ఇదే సర్వే నెంబర్ 3లో రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ అప్పులు చేసి పునాదులు వేశామన్నారు. ప్రభుత్వం నుంచి రుణం పొందేందుకు ఎల్‌పీసీలు ఇవ్వాలని పలుమార్లు వీఆర్వోను కోరామన్నారు. అందుకు వీఆర్వో జిరాయితీ స్థలం అంటూనే మరోపక్క ఇది 22-ఏలో ఉందని ఎల్‌పీసీలు ఇవ్వమని చెప్పారన్నారు. ఈ విషయమై తహసీల్దార్, కలెక్టర్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసినా చర్యలు లేవని ఆవేదన చెందారు. దీనిపై టీడీపీ మండలపార్టీ కార్యదర్శి జుత్తాడ రామసత్యం మట్లాడుతూ ఈవిషయం గతంలో తహసీల్దార్ దృష్టిలో పెట్టామన్నారు. మరోసారి కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ స్థలం విషయంపై వీఆర్వో చోటానూర్ వివరణ కోరగా ఎఫ్‌సీవోలో జిరాయితీగా ఉందన్నారు. అందుకే తాను ఎల్‌పీసీలు ఇవ్వలేదన్నారు. ఈ స్థలం విషయం ఆర్డీవో కోర్టులో ఉందని తెలిపారు.



ఇంటి పట్టాలు చూపిస్తున్న గిరిజనులు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

● జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి రామ్‌ప్రసాద్

కొత్తవలస, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బీవీఎస్ రామ్‌ప్రసాద్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని శారదా కర్మాగారంలోని ఫైర్ సిబ్బందితో కలిసి కొత్తవలస అగ్నిమాపక శాఖ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిప్రమాదాల నియంత్రణపై కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తవలస అగ్నిమాపక అధికారి వై.అశోక్‌కుమార్, కర్మాగార యాజమాన్య ప్రతినిధులు ప్రభాత్ మోహన్, సూర్యభాస్కర్, పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

●గరివిడి: మండలంలో దేవాడలో ఎస్ఎం దాస్ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలో శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై చీపురుపల్లి అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ హేమసుందర్ అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగితే ఎలా తప్పించుకోవచ్చనే దానిపై కార్మికులకు డెమో ఇచ్చారు.

● రాజాం: బొబ్బిలి రోడ్డులోని లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీ, వస్త్రపురి కాలనీలో శ్రీసాయి పెట్రోల్ బంక్ ఆవరణలో శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అగ్నిమాపక శాఖ అధికారి టీఎస్ఎస్ జనార్దనరావు.. మంటలను అదుపు చేయడాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

●విజయనగరం క్రైం: అగ్నిప్రమాదం సంభవించేటప్పుడు పెట్రోల్ బంకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి సోమేశ్వరరావు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని పెట్రోల్ బంకులను సందర్శించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే వాటిని ఎలా నియంత్రించాలనే దానిపై డెమోను నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఈ ఎల్ఎఫ్ ఉమామహేశ్వరరావు, ఎఫ్ఎం మురళీ, హెచ్‌జీ ప్రసాద్, గంగడు తదితరులు పాల్గొన్నారు.



విజయనగరంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం



కొత్తవలస: కర్మాగారంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది

బావిలో దూకి వృద్ధుడి ఆత్మహత్య

పార్వతీపురం, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనారాయణపురంలో అదే గ్రామానికి చెందిన జక్కు దాలినాయుడు(82) శుక్రవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారులు, కుమార్తెలు ఉన్నప్పటికీ వృద్ధుడు ఒంటరిగానే జీవిస్తున్నాడు. మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్టు తెలుస్తోంది. ఘటనపై ఎస్ఐ సంతోషి కేసు నమోదు చేశారు.

పక్షుల మృతిపై నిజాలు నిగ్గుతేల్చండి



మాట్లాడుతున్న దేవుదళ సర్పంచ్

రేగిడి, ఏప్రిల్ 18, (ఆంధ్రజ్యోతి): దేవుదళ హైస్కూల్ ఆవరణలో పదుల సంఖ్యలో కాకులు, పావురాలు మృతి చెందిన ఘటనపై నిజాల నిగ్గు తేల్చాలని దేవుదళ సర్పంచ్ కుప్పిలి దుర్గమ్మ, పలువురు విద్యార్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. పాలకొండకు చెందిన వ్యక్తులు విషప్రయోగం చేశారన్న అనుమానాలు ఉన్నాయన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు స్కూల్ ఆవరణ చుట్టూ మత్తు మందు చల్లటమే ఇందుకు కారణం కావచ్చన్నారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. పిల్లలకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని ఆమె ప్రశ్నించారు. పక్షుల మృతి ఘటనలో హెచ్‌ఎం వ్యవహరించిన తీరు బాగోలేదని సర్పంచ్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఉపాధి వేతనదారులపై తేనెటీగల దాడి

గరివిడి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలో కాపుశంభంలో ఉపాధి పనులు చేపడుతున్న వేతనదారులపై గురువారం సాయంత్రం తేనెటీగలు దాడి చేశాయి. పనులు ముగించి ఇంటికి వెళ్లే ముందు చెట్ల కింద వారు కూర్చున్నారు. దాంతో వేతనదారులపై తేనెటీగల గుంపు దాడి చేసింది. పది మంది వేతనదారులు గాయపడ్డారు. విషయం గమనించిన ఫీల్డ్ అసిస్టెంట్, స్థానికులు వారిని చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వారు కోలుకోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

● ఎక్స్‌కవేటర్, మూడు ట్రాక్టర్ల సీజ్



అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

బొండపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాడిపేట సమీపంలోని సర్వే నెంబరు 15లోని 7లో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న వారిపై రెవెన్యూ అధికారులు శుక్రవారం కొరడా ఝుళిపించారు. గ్రావెల్ తవ్వకాలు, రవాణా చేస్తున్న ఒక ఎక్స్‌కవేటర్, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు తెలిపారు. సర్వే నెంబరు 15లోని 7లో అక్రమంగా గ్రావెల్ తవ్వి, సర్వే నెంబరు 123లోని 1లోని జిరాయితీ భూమిలో గ్రావెల్‌ను వేస్తున్నారనే ఫిర్యాదు మేరకు దాడులు చేశామన్నారు. వాల్టా చట్టం ప్రకారం రూ.25 వేల జరిమానా విధించామన్నారు. వాహనాలను బొండపల్లి ఎస్ఐ యు.మహేశ్‌కు అప్పగించామన్నారు. తదుపరి చర్యలు నిమిత్తం జిల్లా గనుల శాఖ ఏడీకి చర్యల నిమిత్తం నివేదిక అందజేసినట్లు తెలిపారు.

బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

శృంగవరపుకోట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తున్న దాసరి దేముడును శృంగవరపుకోట పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక నూకాలమ్మ ఆలయం వద్ద శ్రీలక్ష్మీ గణేశ్ ఫైర్ వర్క్స్‌లో లైసెన్స్ లేకుండా ఆయన నిల్వ ఉంచిన రూ.2,31,250 విలువైన మందు గుండు సామగ్రిను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కొత్తవలస, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వి.రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎన్జీవో భవనంలో కొత్తవలస తాలూకా యూనిట్ అధ్యక్షుడు జె.వి.ప్రసాదరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగుల రీడెప్లోయ్‌మెంట్ రద్దు చేయాలన్నారు. గ్రామ సచివాలయాల్లో గ్రేడ్-2 ఏఎన్ఎంలుగా ప్రమోషన్స్ లిస్టులను జిల్లాల వారీగా తయారు చేయాలన్నారు. ఉద్యోగులందరికీ ఐఆర్ ప్రకటించాలన్నారు. పీఆర్సీకి సంబంధించిన చైర్మన్ నియామకం చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శుల జీతాలు వ్యత్యాసాలను సరిచేయాలన్నారు. ఐసీడీఎస్ ఉద్యోగులకు ఎఫ్‌టీఏ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘప్రతినిధులు శ్రీను, కృష్ణారావు, భాగ్యలక్ష్మి, స్వర్ణలత, ఈశ్వరరావు, కళావతి, సూర్యారావు, సత్యారావు, వెంకటరమణ, శంకరరావు ఉన్నారు.

కార్మికుల సంఖ్య పెంచండి

రాజాం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీలో కార్మికుల సంఖ్య పెంచాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజాం.. పంచాయతీ నుంచి నగర పంచాయతీ, ఆపై మున్సిపాలిటీగా మార్పు చెందినా అందుకు తగ్గట్టు కార్మికుల సంఖ్యను పెంచలేదన్నారు. కార్మికులపై పనిభారం పెరిగిందని, తద్వారా కార్మికులు రోగాలబారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన పర్యావరణ సమితి



మొక్క నాటుతున్న అగ్నిమాపక శాఖ అధికారి

రాజాం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం అగ్నిమాక కేంద్రం ఆవరణలో పర్యావరణ పరిరక్షణ సమితి మొక్కలు నాటింది. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి టీఎస్ఎస్ జనార్దనరావు పాల్గొన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా 500 గుడ్డ సంచులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పర్యావరణ సమితి కన్వీనర్ ఆర్వీజే నాయుడు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, మానవత అధ్యక్షుడు బీవీ అచ్యుత్‌కుమార్, గట్టి పాపారావు, బాలమురళీకృష్ణ. ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు

గజపతినగరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాయని ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జాతీయ రహదారికి ఇరువైపులా వ్యాపార సముదాయాలతో పాటు ప్రధాన కూడళ్లలో ఇప్పటివరకూ 165 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని కొనిస, జిన్నాం, లింగాలవలస, మరుపల్లి, పురిటిపెంట, గజపతినగరం జంక్షన్‌లో 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నేరాల నియంత్రకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందజేయాలని ఎస్ఐ కోరారు.

ఇప్పలపోలమ్మ పండగను విజయవంతం చేసుకుందాం

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ప్రజల ఇలవేల్పు ఇప్పల పోలమ్మ గ్రామదేవత పండగను విజయవంతం చేసుకుందామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక నాయుడు వీధిలో గల ఇప్పలపోలమ్మ అమ్మవారిని ఆయన దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ పండగకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పలపోలమ్మ పండగను విజయవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ జయబాబు తదితరులు పాల్గొన్నారు.

సాకిగెడ్డ వద్ద చెక్ డ్యాం నిర్మించాలి

- ఎమ్మెల్యే విజయచంద్రకు తాళ్లబురిడి రైతుల వినతి



ఎమ్మెల్యే విజయచంద్రకు వినతిపత్రం ఇస్తున్న తాళ్లబురిడి రైతులు

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాకిగెడ్డ పరిసర ప్రాంతాల్లో చెక్ డ్యాం నిర్మించి తమ వ్యవసాయ భూములకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను తాళ్లబురిడి గ్రామస్థులు కోరారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వారు ఎమ్మెల్యేను కలిసి, వినతిపత్రం అందజేశారు. చెక్ డ్యాం నిర్మించేందుకు తగు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు వివిధ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొప్పుల వెలమ కార్పొరేషన్ డెరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ బాబూరావు

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని తపాలా శాఖ డివిజన్ కార్యాలయ సూపరింటెండెంట్ రెడ్డి బాబూరావు అన్నారు. పార్వతీపురం డివిజన్ పరిధిలోని తపాలా శాఖ ఉద్యోగులకు శుక్రవారం షటిల్ బ్యాడ్మింటిన్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలకు అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ ఐ.మురళి ఆధ్వర్యంలో ఆయన బహుమతులు ప్రదానం చేశారు.

దాడితల్లికి లక్ష మంత్రాలతో కుంకుమార్చన



అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న అర్చకులు

బొబ్బిలి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి బైపాస్ జంక్షన్‌లో గల దాడితల్లి ఆలయంలో శుక్రవారం లక్ష మంత్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. వచ్చే నెల 4 నుంచి మూడురోజుల పాటు అమ్మవారి సిరిమానోత్సవం జరగనున్న నేపథ్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆలయ అర్చకుడు పిండిప్రోలు మణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఆయన శిష్యబృందం అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. ఈ పూజలో వినియోగించిన కుంకుమను, గాజులను భక్తులకు గ్రామదేవత పండగ రోజున అందజేస్తామని ఆయన తెలిపారు.

బొబ్బిలిలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

బొబ్బిలి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూల్‌బాగ్ సెంటరులో ఏపీ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సాయికిరణ్‌యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతీ యువకులు రాణించాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం సర్వసాధారణమన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న వారికి ఎంఎస్ ఆఫీస్, టాలీ, డీటీపీ, సీసీ ప్లస్ కోర్సులలో స్థానిక కంప్యూటర్ సెంటరు నిర్వాహకుడు జి.సాయిప్రసాద్ ఉచితంగా శిక్షణ ఇస్తారని చెప్పారు. 42 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి 12 వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు వెంకటరమణ, పట్నాయక్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే సాగునీరెలా?

- పిచ్చిమొక్కలతో నిండిన వెంగళరాయ సాగర్ కాలువ
- ఇబ్బంది పడుతున్న రైతులు

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలంలోని పలు గ్రామాలకు సాగు నీరందించే వెంగళరాయ సాగర్ కాలువ పూడుకుపోయింది. దీంతో గోపాలరాయుడుపేట, దిబ్బగుడ్డివలస, రాజుపేట, పాతబొబ్బిలి తదితర గ్రామాల శివారు భూములకు సాగునీరు అందడం లేదు. గత వైసీపీ హయాంలో ఉపాధి కూలీలతో మొక్కుబడిగా పనులు చేయించి వదిలేశారు. ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి కాలువలో పూడికలు తీయించాలని రైతులు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలతో నిండిన వెంగళరాయ సాగర్ కాలువ

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

- ఏసు శిలువ యాత్ర ప్రదర్శన
- అధిక సంఖ్యలో పాల్గొన్న క్రైస్తవులు

గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు చర్చిల్లో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ఫాదర్ల ఆధ్వర్యంలో ఏసుప్రభు శిలువ యాత్రను కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించారు. ఈ శిలువ యాత్రలో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



భామినిలో శిలువ యాత్రను ప్రదర్శిస్తున్న దృశ్యం



సాలూరు: పట్టణంలో..



సీతంపేటలో ఏసు శిలువ యాత్ర..



పార్వతీపురంటౌన్: శిలువ యాత్రలో పాల్గొన్న క్రైస్తవులు



బలిజిపేటలో..



గరుగుబిల్లిలో..

ఏకలవ్య ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు సిద్ధం కావాలి

పాచిపెంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కొటికిపెంట ఏకలవ్య ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు విద్యార్థులు సిద్ధం కావాలని పాఠశాల ప్రిన్సిపాల్ దేవేంద్ర సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతి మెరిట్ లిస్టు విడుదలయ్యిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గల 28 ఏకలవ్య పాఠశాలల వివరాలతో పాటు ఎంపికైన విద్యార్థుల జాబితా అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారని ఆయన చెప్పారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల 6వ తరగతి మెరిట్ స్థితిని ఏ పాఠశాలకు ఎంపికయ్యారో ముందస్తుగా వెబ్‌సైట్‌లో తెలుసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 21 నుంచి 30వ తేదీ లోపు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్య కాలంలో ఆయా పాఠశాలలకు వెళ్లి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. విద్యార్థితో పాటు తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, రేషన్‌కార్డు, వికలాంగులు అయితే దానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రం, నాలుగు పాస్ ఫొటోలు సమర్పించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష దాటకుండా ఉండాలన్నారు. తెలుపు రేషన్‌కార్డు ఉన్న వారికి ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరం లేదన్నారు. వివరాలకు 6302863658, 9936666425 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

విద్యా రంగానికి మేలు చేయండి

గరుగుబిల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి మేలు చేసే విధానాలనే అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మర్రాపు మహేష్, బాలకృష్ణలు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఒకే పాఠశాలలో నిర్వహించడం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 9,200 మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేసి, తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని నిర్ణయించడం, అలాగే 700 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా తీర్చిదిద్దడం శుభ పరిణామం అన్నారు. ప్రతి పాఠశాలలో విధిగా ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలన్నారు. విద్యార్థుల సంఖ్య 20 దాటితే అదనంగా 3వ ఉపాధ్యాయుడు నియామకం చేపట్టాలన్నారు. పాఠశాలల్లో తెలుగుతో పాటు ఇంగ్లీష మీడియం సమాంతరంగా కొనసాగించాలని కోరారు. ఫౌండేషన్ పాఠశాల పేరుతో సుమారు 5 వేల పాఠశాలలను కేవలం 1, 2 తరగతులతో నిర్వహించడం సరికాదన్నారు. వీటిని బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చి తరగతికి ఒక ఉపాధ్యాయుడును నియమించాలన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు 117ను పూర్తి స్థాయిలో రద్దు చేసి 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల నుంచి వెనక్కి తీసుకురావాలని వారు కోరారు.

వర్గీకరణలో రెల్లి కులస్థులకు అన్యాయం

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణలో రెల్లి, వాటి ఉపకులాలకు అన్యాయం జరిగిందని ఆ సంఘం జేఏసీ మన్యం జిల్లా కన్వీనర్ జి.డేనియల్ అన్నారు. శుక్రవారం స్థానిక సంఘ భవనంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల్లో ఉన్న మాలలకు 7.5 శాతం, మాదిగలకు 6.5 శాతం రిజర్వేషన్‌లతో పాటు రెల్లి వాటి ఉపకులాల వారికి 1శాతం రిజర్వేషన్ కల్పిస్తూ గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేయడం బాధాకరమన్నారు. సుప్రీంకోర్టు సూచనలను పాటించకుండా వర్గీకరణ చేపట్టడం చట్ట విరుద్ధమన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం, విజయనగరం జిల్లాల రెల్లి కులాల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.గౌరీశంకరరావు పాల్గొన్నారు.

నియమావళికి లోబడి సంస్థాగత ఎన్నికలు

కురుపాం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పార్టీ ఎన్నికల నియమావళికి లోబడి టీడీపీ సంస్థాగత ఎన్నికలు ఉంటాయని పార్టీ కురుపాం నియోజకవర్గ పరిశీలకుడు ఆరేటి మహేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో విస్తృత స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి, బూత్ స్థాయి నుంచి అభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని చెప్పారు. పార్టీ ఆదేశానుసారం గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి కమిటీల నియమకం పారదర్శకంగా చేపడతామని తెలిపారు. పోటీ ఉన్న చోట ఐవీఆర్‌ఎస్ ద్వారా మెజారిటీ అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుంటామని, పోటీ లేని చోట ఏకగ్రీవంగా ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ విషయమై పార్టీ శ్రేణులు పత్రికాముఖంగా ఎటువంటి వివాదస్పద వ్యాఖ్యలు చేయకూడదని ఆయన ఆదేశించారు. ఎవరికైనా తమ అభిప్రాయాలను తెలియజేయాలను కుంటే కురుపాం శాసన సభ్యురాలు జగదీశ్వరి దృష్టికి గాని, పరిశీలకుడి దృష్టికి గాని తీసుకురావాలని సూచించారు.

సోనియా, రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మల దహనం



దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

బెలగాం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కుంభకోణాన్ని వ్యతిరేకిస్తూ పార్వతీపురంలో బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో సోనియా, రాహుల్ గాంధీల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు సిరియాల శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు తిరుపతి, హరీష్, సురేష్, అల్లూరి పేర్రాజు, కనకరావు తదితరులు పాల్గొన్నారు.

కింగ్ కోబ్రాల సయ్యాట

కురుపాం, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): కురుపాం సమీపంలో శుక్రవారం కింగ్ కోబ్రాలు హల్‌చల్ చేశాయి. కురుపాం నుంచి రావాడ వెళ్లే దారిలో నూతనంగా నిర్మిస్తున్న ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రెండు కింగ్ కోబ్రాలు సయ్యాటలాడుతూ కనిపించాయి. వీటిని స్థానికులు ఆసక్తిగా వీక్షించారు.



సయ్యాట ఆడుతున్న కింగ్ కోబ్రాలు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

రామభద్రపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, వీటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాడంగి అగ్నిమాపక కేంద్రం అధికారి ఈ.రామసూర్యారావు అన్నారు. అగ్నిమాపక వారోత్స వాల్లో భాగంగా శుక్రవారం స్థానిక పెట్రోల్ బంకు వద్ద మాక్‌డ్రిల్ నిర్వహించారు. గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎల్‌ఎఫ్‌వో సీహెచ్‌వీ రమణ, డీవోపీ అప్పలరాజు, ఫైర్‌మెన్‌లు పాల్గొన్నారు. ● పార్వతీపురంటౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ గొడౌన్ వద్ద అగ్నిమాపక అధికారి ప్రభాకరరావు ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ గొడౌన్ల వద్ద కార్మికులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, గ్యాస్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.



పార్వతీపురంటౌన్: అవగాహన కల్పిస్తున్న దృశ్యం

డ్రైడేను తప్పనిసరిగా పాటించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

పార్వతీపురం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దోమల వ్యాప్తిని అరికట్టడానికి డ్రైడేను తప్పనిసరిగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి పి.జగన్మోహనరావు అన్నారు. వెంకంపేటం గ్రామంలో నిర్వహించిన డ్రైడే కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. దోమల నివారణకు తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో సత్తిబాబు, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించండి

గరుగుబిల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల పరిధిలో పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, విస్తరణాధికారి ఎల్.గోపాలరావులు సూచించారు. మండలంలోని సుంకి, సంతోషపురం, దళాయివలస, ఉద్దవోలు పంచాయతీల్లో శుక్రవారం డ్రైడేను నిర్వహించారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ తాగునీటి వనరుల వద్ద క్లోరినేషన్ చేపట్టాలన్నారు. పారిశుధ్య నిర్వహణతో పాటు చెత్త సంపద కేంద్రాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సీహెచ్‌వీ కూర్మినాయుడు పాల్గొన్నారు.

● కురుపాం రూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి సూచించారు. మొండెంఖల్, ఉదయపురం పంచాయతీల్లోని పలు గ్రామల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. వారానికి ఒక రోజు డ్రై డేగా భావించి ప్రతిఒక్కరూ తమ పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. ఉపాధి ఏపీవో బావాజీ, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



బెలగాం: డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జగన్మోహనరావు

నిషేధమా.. అదెక్కడ?

(ఐదో పేజీ తరువాయి)

చైతన్యవంతులను చేయాల్సి ఉంది. పర్యావరణ పరిరక్షణ కోసం స్వచ్ఛంద సంస్థలు, వాకర్స్ క్లబ్‌లను భాగస్వాములను చేయాలి. పాలిథిన్, ప్లాస్టిక్ వస్తువుల దిగుమతులపై ఎప్పటికప్పుడు ప్రజారోగ్యశాఖాధికారులు దృష్టి సారిస్తే అమ్మకాలకు అడ్డుకట్టే కాదు.. నివారణ కూడా పక్కాగా జరుగుతుందని ప్రజలు భావిస్తున్నారు.

అమలుకు ప్రణాళికలు..

జిల్లా కేంద్రంలో పాలిథిన్, ప్లాస్టిక్ నిషేధం అమలుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేశాం. పాలిథిన్ సంచులు, గ్లాసులు, ప్యాకెట్ల క్రయ, విక్రయాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు సచివాలయ అధికారులు, సిబ్బందితో దాడులు నిర్వహిస్తున్నాం.

- కె.పకీరురాజు, ప్రజారోగ్యశాఖ ఇన్‌స్పెక్టర్, పార్వతీపురం మున్సిపాల్టీ

న్యూస్ బాక్స్

కార్మికుల సమ్మెను విజయవంతం చేయండి

బొబ్బిలి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కార్మిక లోకానికి తీవ్ర అన్యాయం చేసే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా వచ్చే నెల 20న జరగనున్న సమ్మెకు మద్దతు పలకాలని బొబ్బిలి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక కోవెల సెంటరులో సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీర్మానించారు. ఈసందర్భంగా శంకరరావు మాట్లాడుతూ యాజమాన్యాలు, ప్రభుత్వం ఏ సమయంలోనైనా కార్మికులను తొలగించే విధంగా లేబర్ కోడ్స్‌లో పొందుపరిచారని ఆరోపించారు. శ్రమజీవులంతా తమ హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

సారా స్థావరాలపై దాడులు

జియ్యమ్మవలస, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గడసింగుపురం పంచాయతీ కేంద్రంలో శుక్రవారం సారా తయారీ స్థావరాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో ఏడు డ్రమ్ములతో నిండుగా ఉన్న బెల్లపుఊటను ధ్వంసం చేశారు. 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. తయారీదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ముడిసరుకు సరఫరా చేస్తున్న వీరఘట్టానికి చెందిన వ్యాపారిపై కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో సీతానగరం ఎక్సైజ్ సీఐ పద్మావతి, సిబ్బంది, దత్తత తీసుకున్న గజపతినగరం ఎస్ఐ నరేంద్రకుమార్, బొబ్బిలి ఎస్ఐ శ్రావణ్‌కుమార్, కురుపాం ఎస్ఐలు జె.రాజశేఖర్, పి.చంద్రకాంత్‌లు పాల్గొన్నారు.

23న 'చలో లుంబూరు'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సత్తిబాబు

పాలకొండ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): లుంబూరు గ్రామంలో ఈనెల 23వ తేదీన జనసేన పార్టీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు 'చలో లుంబూరు' పోస్టర్‌ను ఏపీ తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు శుక్రవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వండాన సాయి, కిరణ్, సతివాడ వెంకటరమణ, గర్భాపు నరేంద్ర, బొత్స కార్తీక్, వీరఘట్టం పట్టణ నాయకులు ఎస్ అచ్యుతరావు, కె.వెంకటనాయుడు తదితరులు ఉన్నారు.